క్లుప్తంగా

పదవీకాలం పొడిగించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న సర్పంచులు

గంగాధర: ఎన్నికలు నిర్వహించే వరకు పదవీకాలం పొడగించాలని మండలంలోని పలు గ్రామాల సర్పంచులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రాకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల చివరితో పదవీ కాలం ముగుస్తున్నందున తమనే పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

బల్మూరి వెంకట్‌ను కలిసిన నాయకులు



బల్మూరి వెంకట్‌తో రాసూరి మల్లికార్జున్

గన్నేరువరం: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవమైన బల్మూరి వెంకట్‌ను ఆర్‌టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. యువకులకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వడం హర్షనీయమని, రెండు పర్యాయాలు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ కార్యదర్శిగా పదవులు చేపట్టారని తెలిపారు. 2021లో హుజూరాబాద్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేశారని, సామాన్య నాయకులకు కాంగ్రెస్‌లో సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గాదం స్వామి, గాదం మల్లికార్జున్ పాల్గొన్నారు.


మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం జయప్రకాశ్

జమ్మికుంట: చిరుధాన్యాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని కరీంనగర్ నాబార్డు డీడీఎం జయప్రకాశ్ అన్నారు. పట్టణంలోని కేవీకేలో నాబార్డు సౌజన్యంతో ఎంఈడీపీ(మైక్రో ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) ద్వారా మహిళలకు 15 రోజులు పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ కనబరుస్తున్నారని, చిరుధాన్యాల ఉత్పత్తులతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చాన్నారు. తమిళనాడులో మహిళలు ఇలాగే లాభాలు గడిస్తున్నారని శిక్షణ పొంది ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. బ్యాంక్‌లు ఫుడ్ ఇండస్ట్రీల ఏర్పాటుకు లోన్‌కు సహకారం అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్ రావు, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రశాంతి, ఎన్‌జీవో శోభారాణి, బ్యాంక్ మేనేజర్లు, జమ్మికుంట, హుజూరాబాద్, గంగాధర మండలాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



వరిని పరిశీలిస్తున్న ఏవో వంశీకృష్ణ

చొప్పదండి: రైతన్నలు రసాయన ఎరువులను తగిన మోతాదులో వాడాలని, భాస్వరం దుక్కిలోనే వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ కోరారు. శుక్రవారం రుక్మాపూర్‌లోని వరి పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. తెగుళ్ల నివారణకు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు.

'గంగాడి'కి శుభాకాంక్షలు



జమ్మికుంట: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గంగాడి కృష్ణారెడ్డి రెండోసారి ఎన్నికైన సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, కార్యదర్శి నర్సింహరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుప్పాల రఘు, హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, జమ్మికుంట, హుజూరాబాద్ పట్టణ, వీణవంక మండల అధ్యక్షులు జీడి మల్లేశ్, రామిడి ఆదిరెడ్డి, గంగిశెట్టి రాజు, పల్లపు రవి, భూపతి ప్రవీణ్ మోడెం రాజు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి.. సమయం ఆదా

- యాసంగి వరినాట్లకు యూపీ కూలీలు
- నెలరోజుల పాటు ఇక్కడే నివాసం
- ఎకరాకు రూ.3,500 చొప్పున రోజుకు ఐదెకరాల్లో నాటు
- ఆసక్తి చూపుతున్న రైతులు





వ్యవసాయ పనుల్లో కూలీలు

జమ్మికుంట: యాసంగి వరిసాగు పనులు జోరుగా సాగుతున్నాయి. రైతులు వరినాటు వేసేందుకు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. గతంలో కంటే భిన్నంగా స్థానిక కూలీలను కాదని వలస వచ్చిన యూపీ (ఉత్తరప్రదేశ్) కూలీలతో నాటు వేయించడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీనికి కారణాలు స్థానిక కూలీల కొరత, ఖర్చు ఎక్కువ కావడం. అదే యూపీ కూలీలైతే తక్కువ ఖర్చు.. సమయం ఆదా అవుతుందని వలస కూలీల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. తెలంగాణలో యూపీకి చెందిన మగ కూలీలు వరినాటు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వారి సొంత రాష్ట్రంలో ఉపాధి లేని సమయంలో ఇతర రాష్ట్రాలకు వలస వస్తుంటారు. ఎకరం నాటేసేందుకు రూ.3,500 చొప్పున రోజుకు ఐదు ఎకరాల వరకు నాట్లు వేస్తున్నారు. ఆసక్తి గల రైతులకు నాటువేసి సమయం, ఖర్చు తగ్గిస్తున్నారు. నెల రోజులుగా హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లిలో నివాసం ఉంటున్నారు. దీంతో రైతులు వరి నాటు పనులకు యూపీ కూలీలను ఆశ్రయిస్తున్నారు. ఒక ఎకరం పొలం నాటు వేయడం ఇక్కడి మహిళా కూలీలు 12 మంది అవసరం. ఒక్కరికి కూలి రూ.400 చొప్పున ఎకరంకు రూ.4,800 వరకు ఖర్చు అవుతుంది. నారు మోసేందుకు మగ కూలీ, ఇతర ఖర్చులు రూ.1,400 అవుతాయి. అన్నీ కలిపి ఎకరానికి సుమారుగా రూ.6,200 ఖర్చు. కూలీల డిమాండ్‌ను బట్టి సీజన్‌లో రేట్లు మరింత పెరిగే అవకాశం ఉంది.

రోజుకు రూ.వెయ్యి



యూపీ నుంచి 19 మందిమి ఇక్కడికి నాట్లు వేసేందుకు వచ్చాం. నెల రోజులుగా సిర్సపల్లిలో ఉంటున్నాం. రోజుకు ఐదెఎకరాల వరకు నాటు వేస్తాం. ఎకరాకు రూ.3,500 చొప్పున తీసుకుంటాం. ఒక్కో వ్యక్తికి రోజుకు రూ.800 నుంచి రూ.1000 వరకు వస్తాయి.

– సహదేవ్, కూలీ, యూపీ

కూలీల కొరత తీరింది



పత్తి తీయడం, మొక్కజొన్న వేయడం వంటి పనులతో యాసంగి వరినాట్లకు కూలీల కొరత ఏర్పడింది. స్థానిక కూలీల కంటే తక్కువ రేటుకు యూపీ కూలీలు నాటు వేస్తున్నారు. పెట్టుబడి తగ్గడంతోపాటు సమయం కూడా ఆదా అవుతుంది.

– పొన్నాల రాజిరెడ్డి, మడిపల్లి, జమ్మికుంట

అయోధ్య రాములోరి అక్షింతల పంపిణీ



గర్రెపల్లిలో అక్షింతల పంపిణీ

సైదాపూర్: మండలంలోని గర్రెపల్లిలో అయోధ్య రాములోరి అక్షింతలను శుక్రవారం ఊరేగించి, ఇంటింటికి పంపిణీ చేశారు. ఆయా పార్టీల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు అనగోని శ్రీనివాస్, బీజేపీ నాయకులు తిప్పిరి శెట్టి రమేశ్, దొకిడి రాజేశ్వర్‌రావు, మోకిడి శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ మోహన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు దొకిడి తిరుపతి, మోకిడి తిరుపతి, చల్లూరి కుమార్, పుప్పాల శంకర్, తిప్పిరి శెట్టి ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆలయం శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ శాంతికుమార్ గుడి ఆవరణను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రశాంత్‌కుమార్, ఎన్‌వైకే వాలంటీర్ చల్ల అనూశ్ పాల్గొన్నారు. శనివారం పట్టణంలోని శ్రీవేంకటేశ్వ మణికంఠ ఆలయంలో స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రామడుగు: మండల కేంద్రంలో శుక్రవారం పీఆర్‌టీయూటీఎస్ 2024 క్యాలెండర్‌ను మండల అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పద్మజ, రత్నాకర్‌రెడ్డి, రాజేందర్, జయలక్ష్మి, శైలజ, శిరీషా, అరుణశ్రీ, జ్యోతి, కిషన్, రమేశ్, దేవేందర్, హరిత, రజిత, పలువురు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: టీఎన్‌జీవో తిమ్మాపూర్, గన్నేరువరం యూనిట్ క్యాలెండర్‌ను యూనిట్ అధ్యక్షుడు పోలు కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, రాష్ట్ర నాయకుడు హరికిషన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీను హాజరయ్యారు. కార్యక్రమంలో కార్యదర్శి అంబటి నాగరాజు, కోశాధికారి అశోక్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వొంటెల రవీందర్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, రాఘవరెడ్డి, పవన్, కయ్యం శ్రీనివాస్, అజగర్, జిల్లా, పట్టణ అధ్యక్షులు హర్మిందర్ సింగ్, పట్టణ కార్యదర్శి సుమంత్, రూరల్ అధ్యక్షులు రాజేశ్‌భరద్వాజ్, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



రామడుగు: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉపాధ్యాయులకు సన్మానం

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి పదోన్నతి, బదిలీపై ఇతర స్కూళ్లకు వెళ్లిన ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎ. భారతి హెచ్‌ఎంగా పదోన్నతి పొందింది. పి. గోవర్ధన్ బదిలీపై వెళ్లగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, ఎస్ఎంసీ చైర్మన్ గంప రమేశ్, హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు కె. శ్యామయ్య, సీహెచ్ జోత్స్న, ఎం శంకరమ్మ, బి. శంకర్, పి. ప్రతిమ, జి. చంద్రశేఖర్, ఎ. శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

లారీని ఢీకొన్న కారు

శంకరపట్నం: ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్‌వేయడంతో వెనకాలే వస్తున్న కారు లారీని ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు తెలిపిన వివరాలు... శుక్రవారం కరీంనగర్ నుంచి లారీ, కారు హుజూరాబాద్ వైపు వెళ్తుండగా.. కేశవపట్నం సమీపంలో లారీ సడన్ బ్రేక్ వేయగా వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొంది, దీంతో కారు ముందు భాగం ధ్వంసమైంది. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

జమ్మికుంట: ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేశ్ తెలిపిన వివరాలు మండలంలోని గండ్రపల్లికి చెందిన మాదారపు మాధవరావు, ఒరుగంటి హేమచందర్‌రావు, శెట్టి బుచ్చయ్యకు చెందిన ట్రాక్టర్లను గండ్రపల్లి గ్రామ శివారులో నిలిపారు. ఈ నెల 16న దొంగలు బ్యాటరీలను ఎత్తుకెళ్లారని, బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

లంపీస్కిన్‌తో దూడ మృత్యువాత

మానకొండూర్: మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామంలో బండి రవికి చెందిన దూడ శుక్రవారం లంపీస్కిన్ వ్యాధితో మృతి చెందింది. దూడలకు వ్యాధి సోకినట్లయితే పశువైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని, తగిన మందులు అందజేస్తామని మండల పశువైద్యాధికారి అరవిందరెడ్డి సూచించారు.

హెల్త్ సెంటర్ నిర్మాణం విరమించుకోవాలి

హుజూరాబాద్: పట్టణంలోని 154 సర్వేనంబర్‌లో ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో హెల్త్ సెంటర్ నిర్మాణం చేపట్టడం సరికాదని, నిర్ణయాన్ని విరమించుకోవాలని డివిజన్ మజీద్ అండ్ ఈద్గా కబ్రస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుల అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ శుక్రవారం తెలిపారు. పాఠశాల భవన నిర్మాణానికి గతంలో 3 గుంటల భూమి కేటాయించారని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సైతం తీసుకెళ్లామని, హెల్త్ సెంటర్ నిర్మిస్తే బయోవేస్టేజీతో చిన్నారులు అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందన్నారు.

21న ఆటలపోటీలు

హుజూరాబాద్: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని 21న వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోఉదయం 6 గంటలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు హుజూరాబాద్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల గోవర్ధన్, సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రన్నింగ్, షాట్‌పుట్, తదితర ఆటలు జరుగుతాయని తెలిపారు. క్రీడల్లో వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రత్యేక ఓటరు నమోదు

రామడుగు: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 20, 21న, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నామని తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. జనవరి 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ స్థానిక బీఎల్‌వోను కలిసి ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

తిమ్మాపూర్: జనవరి 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కనకయ్య కోరారు. ఓటరు నమోదుకు శని, ఆదివారాల్లో మండల పరిధిలో బూత్ లెవెల్ అధికారులను సంబంధిత ఫారములతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని తెలిపారు. 18 ఏళ్లు నిండినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరామర్శ

రామడుగు: మండలంలోని గుండి గ్రామానికి చెందిన సింగిల్ విండో మాజీచైర్మన్ మానుపాటి బా లయ్య అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండి ప్రవీణ్, పాల్గొన్నారు.

అడ్తిదారుల కమిటీ



స్వీట్లు తినిపిస్తున్న కార్యదర్శి రెడ్యానాయక్

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లోని అడ్తిదారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, కమిటీ సభ్యులకు మార్కెట్ కార్యదర్శి గగూలోతు రెడ్యానాయక్ శుక్రవారం శుభాకాంక్షలు తెపిపారు. అనంతరం శాలువాలతో సత్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మార్కెట్ సూపర్‌వైజర్ లక్షణ్, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

గంగాధర: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. కళాశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల గోడకు నిధులు మంజూరు చేయాలని ప్రిన్సిపాల్ ప్రమీల వినతిపత్రం అందజేశారు. నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల సిబ్బంది సొంత ఖర్చులతో విద్యార్థులకు అల్పాహారం అందించడం అభినందనీయమని, స్వచ్ఛంద సంస్థలు సైతం ప్రభుత్వ కళాశాలలకు అండగా నిలవాలన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. అంతకు ముందు ఏఆర్ అకాడమీ చైర్మన్ లక్ష్మణ్ అందజేసినన పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులను ప్రిన్సిపాల్ విద్యార్థులకు అందజేశారు.

మసీదు నిర్మాణానికి ఆర్థికసాయం

ఆదర్శంగా నిలుస్తున్న నర్సింగాపూర్ సర్పంచ్ తోట మమత



మసీదును ప్రారంభిస్తున్న సర్పంచ్ మమత, గ్రామస్తులు

తిమ్మాపూర్: దైవ కార్యానికి సంకల్ప బలం ఉండాలి. అదే మనతో అన్ని పనులు చేయిస్తుంది అంటారు పెద్దలు. నర్సింగాపూర్ సర్పంచ్ తోట మమత అదే సంకల్ప బలంతో ముందుకుసాగుతున్నారు. కుల మతాలకు అతీతంగా గ్రామాన్ని సొంత డబ్బులతో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే రూ. లక్షలతో గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేశారు. తాజాగా మతసామరస్యానికి ప్రతీకగా గ్రామంలో మసీదు నిర్మాణానికి ముందుకు వచ్చారు. రూ.3.70 లక్షలు అవసరం కాగా మైనారిటీ కమిటీ రూ.లక్ష అందించగా మిగతా రూ. 2.70 లక్షలు సర్పంచ్ మమత సొంతంగా అందించి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసే వరకు వేచి చూడకుండా, గ్రామంలో పన్నుల వసూళ్లపై ఆధార పడకుండా అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి సొంతంగా నిధులు వెచ్చించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయ పునరుద్ధరణకు, సీసీ కెమెరాలకు ఏర్పాటుకు ఆమె సొంతంగా లక్షల్లో విరాళం ఇచ్చారు. తాజాగా మసీదు నిర్మాణానికి విరాళం అందించి శుక్రవారం మసీదును ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామస్తుల సహకారంతో సమష్టిగా, కులమతాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని, గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ఇందుకు అధికారులతో పాటు గ్రామస్తులు, పార్టీలకతీతంగా నాయకులు పూర్తిగా సహకరిస్తున్నారని పేర్కొన్నారు.

మంచి అలవాట్లు అలవర్చుకోవాలి

డీఈవో జనార్దన్‌రావు

మానకొండూర్: విద్యార్థులు మంచి అలవాట్లు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన స్నేహిత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు అలవాటు కావద్దని సూచించారు. విద్య ప్రాముఖ్యత వివరించారు. ఇంటర్నెట్ దుష్ఫలితాలను తెలిపారు. పోషకాహారం, బాల్యవివాహాలు, లింగ వివక్షత, మాదక ద్రవ్యాల వినియోగం గురించి వివరించారు. టీచర్స్, పేరెంట్స్ మాటవిని ప్రయోజకులు కావాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీవో సబితాకుమారి, హెచ్‌శ్రీం జ్యోతి, వైద్యాధికారి గోపాల్, ఎఎస్సై బి. చారీ, టీచర్లు పాల్గొన్నారు.

చొప్పదండి: విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత కోరారు. మండలంలోని రుక్మాపూర్ శివారు మోడల్ స్కూల్, కేజీబీవీలో విద్యార్థినులకు శుక్రవారం స్నేహిత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థినులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సౌందర్య, మెడికల్ అధికారి రాజేశ్, సూపర్‌వైజర్ రమాదేవి, డీపీఎం శ్రీనివాస్, హెచ్‌ఎం రమేశ్, భార్గవి, ఏఎస్ఐ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి, విలాసాగర్ గ్రామాల్లోని పాఠశాలల్లో కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు స్నేహిత కార్యక్రమంలో గడ్ అండ్ బ్యాడ్ టచ్, సురక్షిత బాల్యంపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి, చెడు,స్వీయ రక్షణ, సురక్షితమైన వాతావరణం సృష్టించడం వంటి అంశాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు డాక్టర్ మహోన్నత పటేల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, డిస్ట్రిక్ ఉమెన్ అండ్ ఫైనాన్స్ అధికారి రోహిణి, పోలీస్ కానిస్టేబుల్ శివరంజని, ఏఈవో లక్ష్మణ్, వీవోఏ కరుణ, ఎంపీహెచ్‌ఏ సావిత్రి, హెచ్‌ఎం వేణుమాధవ్, విలాసాగర్ సర్పంచ్ పింగిలి రమాదేవి, వైద్యులు డాక్టర్ హిమబిందు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ పద్మా, ప్రధానోపాధ్యాయురాలు కుమారి, ఏఈవో తిరుపతి, కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



చొప్పదండి: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట, రుద్రారం పాఠశాలలో స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఎట్టి పరిస్థితుల్లో చెడు అలవాట్ల వైపు వెళ్లొద్దని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గ్రీష్మన్య, అరుణ, ప్రధానోపాధ్యాయులు శైలజ, రంగనాథ శర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, జయప్రద, డీఆర్పీవో శ్రీలత, శ్రీలత, కవితా దేవి, పుష్పలత టీచర్లు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలో శుక్రవారం స్నేహిత మొదటి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలపై జరుగుతున్న లైంగికదాడులు, శారీరక మార్పులపై బాలికలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. లింగవివక్షత, మాదకద్రవ్యాల వినియోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉపేందర్, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇష్రాత్ సుల్తానియా, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, ఏఎన్‌ఎం రాధ, మహిళ సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



జమ్మికుంట: అవగాహన కల్పిస్తున్న అధికారులు



చొప్పదండి: మాట్లాడుతున్న ఎంఈవో